క్లుప్తంగా

16న మంత్రి పొంగులేటి సభ

భీమారం: ఈ నెల 16న మండలంలోని పోతన్‌పల్లి గ్రామంలో భూభారతి చట్టంపై సభ నిర్వహించనున్నారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరు కానున్నారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో సభ ఏర్పాట్లను బుధవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పరిశీలించారు. సభకు హాజరయ్యే రైతులకు తాగు నీరు, నీడ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్ రావు, తహసీల్దార్ సదానందం, పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ముగిసిన సమ్మర్ క్యాంప్

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని వికాస తరంగిణి అధ్వర్యంలో ఈనెల 2 నుంచి 14 వరకు నిర్వహించిన ప్రజ్ఞ సమ్మర్ క్యాంప్ బుధవారం ముగిసింది. 12 రోజుల పాటు చిన్నారులకు నైతిక విలువలు, ఆధ్యాత్మికత, సంస్కృతి సంప్రదాయాలు, ఆటలు, పాటలు, కథలు, యోగాపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాళ్లు జగన్మోహిని గౌడ్, పద్మజ, రజిత, రాజబాపు పాల్గొన్నారు.

యువతి వివాహానికి చేయూత

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని జగన్నాథాలయంలో మేదరివాడకు చెందిన బుర పద్మ వివాహాన్ని సాయి అన్నపూర్ణ వృద్ధాశ్రమంలో బుధవారం జరిపించారు. పద్మకు తల్లిదండ్రులు రుక్కమ్మ, బండయ్యలు గతంలో మృతి చెందారు. గోదావరిఖని పట్టణానికి చెందిన పోతు మహేశ్ అనే యువకుడితో ఘనంగా వివాహం నిర్వహించారు. కార్యక్రమంలో సాయి అన్నపూర్ణ వృద్ధాశ్రమ నిర్వాహకులు పుల్లూరి సత్తెయ్య, పడమటింటి శ్రీనివాస్, అర్చకులు మోహనాచారులు పాల్గొన్నారు.

కల్వర్టుల వద్ద తనిఖీలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల పరిధిలోని జాతీయ రహదారి 63పై ఉన్న కల్వర్టులను బుధవారం హాజీపూర్ పోలీసులు పూర్తిస్థాయిలో తనిఖీ చేశారు. ప్రముఖుల పర్యటనలతో పాటు వివిధ కార్యక్రమాల నేపథ్యంలో హాజీపూర్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్ నేతృత్వంలో బెల్లంపల్లి ఏఆర్‌కు చెందిన బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలతో మండల పరిధిలోని అన్ని కల్వర్టుల వద్ద సాధారణ తనిఖీలు నిర్వహించారు.

డిప్యూటేషన్ రద్దు చేయాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఉదయ్ కుమార్‌ను ఆకారణంగా డిప్యూటేషన్ పేరుతో ట్రాన్స్‌ఫర్ చేయడాన్ని నిరసిస్తూ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు బుధవారం నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

'మంత్రి, ఎమ్మెల్యే వ్యాఖ్యలు సరికావు'

జన్నారం: మండల కేంద్రంలోని హరిత రిసార్ట్‌లో ఆదివాసీలకు మూడురోజులు రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే బొజ్జుపటేల్‌లు ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలపై చేసిన వ్యాఖ్యలు సరికాదని బీజేపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బద్రినాయక్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం మాట్లాడారు. ఆదివాసీల అభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తున్నప్పటికీ, మంత్రి, ఎమ్మెల్యే మాట్లాడిన తీరు మత విద్వేశాలు సృష్టించినట్టుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయడంతో పాటుగా ఆదివాసీల అభివృద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేశారు.

పోలీస్‌స్టేషన్‌లో క్యూఆర్ కోడ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌లో ప్రజలకు సులభంగా కనిపించే విధంగా సిటిజన్ ఫీడ్ బ్యాక్ క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేసినట్లు ఎస్సై స్వరూప్‌రాజ్ బుధవారం తెలిపారు. సీపీ అంబర్‌కిషోర్ ఝా ఆదేశాల మేరకు డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాశ్‌ల సూచనల మేరకు స్టేషన్‌లో పలు చోట్ల సిటిజన్ ఫీడ్ బ్యాక్ క్యూ ఆర్ కోడ్ ఏర్పాటు చేశామన్నారు. పోలీసుల పనితీరును మరింత మెరుగు పరుచుకునేందుకు క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజలు ముఖ్యంగా యువత తమ అభిప్రాయాలను, సూచనలు చేయవచ్చని పేర్కొన్నారు.

ఆస్నాద గ్రామంలో మళ్లీ ట్రెంచింగ్

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాద గ్రామంలో గత ఏడాది 2024లో పట్టా భూముల విషయంలో నెలకొన్న వివాదాన్ని రైతులు చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ దృష్టికి తీసుకు వెళ్లగా ఆయన సూచన మేరకు అటవీశాఖ అధికారులు గ్రామానికి వెళ్లి భూములను పరిశీలించారు. కానీ మళ్లీ అటవీశాఖ అధికారులు బుధవారం రైతుల ఇళ్లలోకి వెళ్లి ట్రెంచ్ ఏర్పాటు చేస్తామని హెచ్చరించారు. గతంలోనే ఎమ్మెల్యే ఆధ్వర్యంలో తమకు భూములు అప్పగించారని రైతులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే స్పందించి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

వర్షం.. అపార నష్టం

- తడిసిన ధాన్యం
- నేలరాలిన మామిడి కాయలు
- ఆందోళనలో రైతులు



కోటపల్లి: కల్లంలో పేరుకుపోయిన ధాన్యం



మందమర్రిరూరల్: కొనుగోలు కేంద్రంలో నిలిచిన వర్షపునీరు

భీమారం: మండల వ్యాప్తంగా బుధవారం తెల్లవారు జామున కురిసిన అకాల వర్షానికి వరి ధాన్యం పూర్తిగా తడిసింది. వారం రోజుల కింద కురిసిన వర్షానికి నష్టపోయిన రైతులు ఇప్పుడిప్పుడు కొలుకుంటున్న సమయంలో ప్రకృతి మరోసారి కన్నెర్ర చేసింది. రాత్రి వర్షం కురువడంతో తీవ్ర నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జైపూర్: మండలంలో కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. ఈ ఏడాది ఊహించని విధంగా మేలోనే అకాల వర్షాలు కురవడం చేతికి అందిన పంట కళ్లముందే దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ముదిగుంట, కాన్కూర్, ఇందారం, రామారావుపేట, షెట్‌పల్లి, కుందారం, వేలాల, పౌనూర్ శివారులో కుండపోత వర్షం కురిసింది. కొన్ని గ్రామాల్లో ఆరబెట్టిన ధాన్యం కొట్టుకుపోయింది. చేతికి వచ్చిన మామిడి చెన్నూర్‌రూరల్: మండలంలో బుధవారం తెల్లవారు జామున ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో మండలంలోని కిష్టంపేట, లంబడిపల్లి, లింగంపల్లి, అక్కెపలి, అంగ్రాజ్‌పల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో రైతులు హుటాహుటిన ధాన్యంపై కవర్లు కప్పారు. కొనుగోలు కేంద్రాల్లో వర్షపు నీరు చేరడంతో రైతులు నీటిని ఎత్తి పోశారు.

మందమర్రిరూరల్: అకాల వర్షాలు రైతులకు భారీ నష్టాన్ని మిగులుస్తున్నాయి. చేతికివచ్చిన పంట అమ్మకానికి కొనుగోలు కేంద్రాలకు తరలిస్తే మాయదారి వాన రాత్రి సమయంలో కురవడంతో ధాన్యం తడిసి ముద్దయింది. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించక పోవడంతో తీవ్ర నష్టం కలుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోటపల్లి: గత మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు రైతులు భయాందోళనలు చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ వేగంగా జరగక కేంద్రాల్లోనే బస్తాల్లో ఉండిపోగా చాలా చోట్ల ధాన్యం తూకంలో ఆలస్యం జరుగుతుందని వాపోతున్నారు. అధికారులు స్పందించి త్వరగా ధాన్యం తూకం వేసి మిల్లులకు తరలించాలని కోరుతున్నారు.



జైపూర్: పేరుకుపోయిన ధాన్యం



భీమారం: తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు

కవర్లు కప్పి.. జాగ్రత్తపడి

దండేపల్లి: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించే రైతులకు అకాల వర్షాలు గుబులు పుట్టిస్తున్నాయి. బుధవారం తెల్లవారు జామున కురిసిన అకాల వర్షానికి దండేపల్లి మండలంలో ధాన్యం కుప్పలు, బస్తాలు తడవకుండా రైతులు కవర్లుకప్పి జాగ్రత్త పడ్డారు. ఆరబోసిన ధాన్యంను కుప్పలు చేసి తడవకుండా కవర్లు కప్పి ఉంచారు.



సమ్మె విజయవంతం చేయండి

కాసిపేట: కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్రమోదీ కార్మిక వ్యతిరేఖ విధానాలకు నిరసనగా ఈనెల 20న చేపట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను సింగరేణిలో కార్మికులు ఐక్యంగా విజయవంతం చేయాలని ఐక్య కార్మిక సంఘాల నాయకులు కోరారు. బుధవారం మందమర్రి ఏరియా కాసిపేట 1గనిపై ఐక్య కార్మిక సంఘాలు ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కమిటీ ప్రచార కార్యదర్శి బన్న లక్ష్మణ్‌దాస్, సీఐటీయూ వైస్ ప్రెసిడెంట్ వెంకటస్వామి మాట్లాడుతూ.. నరేంద్రమోదీ ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌కు అప్పచెప్పుతు బొగ్గు గనులు బడా పారిశ్రామిక వేత్తలకు అప్పగిస్తుందన్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఫిట్ కార్యదర్శి భైరి శంకర్, మినుగు లక్ష్మినారాయణ, రాజేందర్, సోగాల కన్నయ్య, రాజ్‌కుమార్, సంపత్, రాజేశం, చొల్లంగి శ్రీనివాస్, అఫ్జలోద్దిన్, రమేశ్ పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: ఈనెల 20న జరిగే టోకెన్ సమ్మెలో సింగరేణి కార్మికుల పాల్గొనాలని సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ నాయకులు కోరారు. బుధవారం ఎస్ఆర్పీ 3 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సమ్మె జరుగుతుందన్నారు.



మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

కార్మిక చట్టాలను కుదించి కొత్త చట్టాలతో కార్మిక వర్గాన్ని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. సమ్మెతో కేంద్రానికి కనువిప్పు కలిగించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బాజీ సైదా, ఐఎన్టీయూసీ జెట్టి శంకర్‌రావు, కలవేన శ్యామ్, నాగరాజు గోపాల్, శ్రీనివాస్, కేతిరెడ్డి సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆర్కే 7 గనిపై..

ఆర్కే 7 గనిపై జేఏసీ నాయకులు గేట్ మీటింగ్ నిర్వహించి కార్మికులు సమ్మెలో పాల్గొనాలని కోరారు. దేశ వ్యాప్తంగా పర్మినెంట్ కార్మికరగంతో పాటు అసంఘటిత కార్మికరంగం ఈ సమ్మెలో పాల్గొంటుందన్నారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ నాయకులు టీ శ్రీనివాస్, హెచ్ఎమ్మెస్ నాయకులు తిప్పారపు సారయ్య, అనిల్‌రెడ్డి, బ్రహ్మానందం, మిట్టపల్లి కుమారస్వామి పాల్గొన్నారు.

సమ్మెకు దూరంగా ఉండాలి

శ్రీరాంపూర్: ఈనెల 20న జరిగే దేశ వ్యాప్త సమ్మెకు సింగరేణిలో కార్మికుల దూరంగా ఉండాలని శ్రీరాంపూర్ జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. బుధవారం జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏరియా అధికారులతో కలిసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని డిమాండ్లపై సింగరేణిలో సమ్మె చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. దీని వల్ల సంస్థకు నష్టం జరుగడంతో పాటు కార్మికుల కూడా వేతనాలు కోల్పోతారన్నారు. ఒక్క రోజు సమ్మె చేస్తే కంపెనీకి 2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి నష్టం జరుగుతుందన్నారు. దీని విలువ సుమారు రూ. 6 కోట్లు ఉంటుందన్నారు. సమ్మె రోజు కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు నిర్భయంగా డ్యూటీలకు రావాలని వారికి గనుల వద్ద రక్షణ కల్పిస్తామన్నారు. సమావేశంలో ఏరియా ఎస్ఓటు జీఎం యస్ సత్యనారాయణ, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, ఐఈడీ ఎస్ఈ కిరణ్‌కుమార్, సీనియర్ పీవో కాంతారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీఎం ఎం శ్రీనివాస్

ధాన్యం అక్రమ రవాణా అరికట్టాలి

కోటపల్లి: సరిహద్దుల్లో ధాన్యం అక్రమ రవాణాను అరికట్టాలని తహసీల్దార్ రాఘవేంద్రరావు అన్నారు. బుధవారం అంతరాష్ట్ర చెక్‌పోస్టు మీదుగా వడ్ల లోడ్‌తో వస్తున్న వాహనాన్ని ఆపి తనిఖీ చేసి మహారాష్ట్రకే తిరిగి పంపించినట్లు తెలిపారు. తెలంగాణలో వరికి మద్దతు ధరతో మహారాష్ట్ర నుంచి ధాన్యం రాకుండా చెక్‌పోస్టు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం బబ్బరుచెల్క వరి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆర్ఐ శ్రీనివాస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు పూర్తి చేయాలి

బెల్లంపల్లిరూరల్: వరి ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలని ఆర్డీవో పి.హరికృష్ణ అన్నారు. బుధవారం మండలం చంద్రవెల్లి, మాలగురిజాల గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. రైతులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులకు మహిళా సాధికారతపై బుధవారం జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ మహిళా సాధికారత హబ్ ఆర్థిక అక్షరాస్యత నిపుణులు లిప్సిక, విజయలు అవగాహన కల్పించారు. బేటీ బచావో, బేటీ పడావో పథకం, బాల్యవివాహాల నిరోధక చట్టం, ఆన్‌లైన్ సేఫ్టీ, సైబర్ క్రైమ్, మహిళా హెల్ప్‌లైన్ 1930, సఖీ హెల్ప్‌లైన్ 181, పోక్సో చట్టం గురించి వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మందమర్రిరూరల్: సింగరేణి ఏరియా సేవా సమితి ఆధ్వర్యంలో తేనెటీగల పెంపకంలో శిక్షణ కోసం ఆసక్తి గలవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి ఉద్యోగుల పిల్లలు, సమీప గ్రామాల నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు షోకాజ్ నోటీసు

చెన్నూర్: చెన్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో నర్సుల దినోత్సవం సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణ చాంబర్‌లోనే నర్సులు, సూపరింటెండెంట్ స్టెప్పులు వేసిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించి మంగళవారం విచారణ చేపట్టారు. విచారణ నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. బుధవారం ఆసుపత్రి సూపరిటెండెంట్ సత్యనారాయణకు వైద్యా విధాన పరిషత్ కమీషనర్ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు డీసీహెచ్‌వో కోటేశ్వర్‌రావు తెలిపారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

నస్పూర్: ప్రతిఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలని షీ టీం ఎస్సై ఉషారాణి అన్నారు. పట్టణ పరిధిలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో జరుగుతున్న సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు షీ టీం సభ్యులు బుధవారం అవగాహన కల్పించారు. సైబర్ నేరా లు, ఏదైనా సమస్య ఉన్నా.. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. షీ టీం సభ్యులు శ్రవణ్, జ్యోతి, పాఠశాల ఎస్‌వో మౌనిక, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎంబీసీ డీఎన్టీల సమస్యలు పరిష్కరించాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్ ఏవో రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. పోరాట సమితి కన్వీనర్ జి. శ్రీనివాస్ మాట్లాడుతూ సంచార కులాలు, డీఎన్టీయులకు శాశ్వత కమీషన్ ఏర్పాటు చేయాలన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

బెల్లంపల్లి: ప్రభుత్వం మంజూరు చేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. బుధవారం ఏఎంసీ ఏరియాలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ 31 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డ పెళ్లికి ఆసరాగా ఉండాలని ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కొనసాగిస్తోందన్నారు. అర్హత కలిగిన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంతో గ్రామాలకు మహర్దశ

- ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

భీమారం: రోడ్ల నిర్మాణంతో గ్రామాలకు మహర్దశ రానుందని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. రూ.3.35 కోట్ల సీఆర్‌ఆర్ నిధులతో భీమారం మండలం బూర్గుపల్లినుంచి దాంపూర్‌వరకు నిర్మించనున్న బీటీరోడ్డు పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. చెన్నూరు నియోజవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు పాటు పడుతున్నామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో గ్రామీణ రోడ్లను పట్టించుకోలేదన్నారు. నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పొడేటి రవి, వేల్పుల శ్రీనివాస్, బుక్యా లక్ష్మణ్, మాజీ జెడ్పీటీసీ బుక్యా తిరుమల, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటి పరిధిలోని పలు వార్డుల్లో అభివృద్ధి పనులకు బుధవారం చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి శంకుస్థాపనలు చేశారు. ఆరు నెలల్లో పట్టణంలోని అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి

కోటపల్లి: గ్రామాల్లో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తామని బీజేపీ మండల అధ్యక్షురాలు పెద్దింటి స్వప్న అన్నారు. బుధవారం సిర్సా గ్రామంలో బూత్ లెవల్ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కేంద్రంలో బీజేపీ పథకాలను ఇంటింటా అవగాహన కల్పించి పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, పున్నం, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్వప్న

బీజేపీ మండల అధ్యక్షుడిగా ఆశన్న

భీమిని: కన్నెపల్లి మండల బీజేపీ అధ్యక్షుడిగా మాడవెల్లి గ్రామానికి చెందిన మైదం ఆశన్న బుధవారం ఎన్నికయ్యారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ నుంచి నియామక పత్రం అందుకున్నారు. ఆశన్న మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పట్టి వెంకటకృష్ణ, రామన్నయాదవ్, ఉప్పరి సాయి పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి నిధులు మంజూరు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తాలో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఆసుపత్రి నిర్మాణ పనులకు రూ. 250 కోట్లను విడుదల చేస్తూ, హెల్త్, మెడికల్, ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్టుమెంట్ ఈనెల 13న జీవో విడుదల చేసింది. 600ల పడకలతో 4.33 ఎకరాల స్థలంలో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ, మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఆసుపత్రి నిర్మాణం కోసం రూ. 300 కోట్ల బడ్జెట్‌ను కేటాయించారు. మొదటి విడతలో రూ. 50 కోట్లను విడుదల చేయడంతో పనులను ప్రారంభించగా, మిగిలిన రూ. 250 కోట్ల నిదులను విడుదల చేస్తూ జీవో ఇవ్వడంతో, నిర్మాణ పనులు మరింత వేగంగా పూర్తయ్యేందుకు అవకాశం ఉంది. కాలేజీరోడ్డులో ప్రస్తుతం కొనసాగుతున్న మాతా శిశు ఆసుపత్రిని, నూతన భవనం పూర్తికాగానే షిఫ్ట్ చేయనున్నారు.

పత్రాల పరిశీలన పూర్తి చేయాలి

బెల్లంపల్లిరూరల్: రాజీవ్ యువవికాస అర్హుల ధ్రువీకరణ పత్రాల పరిశీలనను వెంటనే పూర్తి చేయాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సీహెచ్ దుర్గాప్రసాద్ అన్నారు. బుధవారం బెల్లంపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బెల్లంపల్లి యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి హాజరయ్యారు. రాజీవ్ యువ వికాస పథకం కోసం దరఖాస్తు చేసుకున్న వారి ధ్రువీకరణ పత్రాలను ఈనెల 17లోగా పరిశీలన పూర్తి చేసి పూర్తిస్థాయి నివేదికలను ఉన్నతస్థాయి అధికారులకు అందజేయాలన్నారు. సమావేశంలో మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వరి, ఎంపీడీవోలు మహేందర్, శ్రీనివాస్, గంగామోహన్, ఏపీఎంలు, ఏపీవో, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్

బక్రీద్ పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలి

మంచిర్యాలక్రైం: ముస్లింలు బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్ అన్నారు. బుధవారం స్థానిక ఏసీపీ కార్యాలయంలో హిందు, ముస్లిం, క్రైస్తవ మత పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ పశు వైద్యాధికారి సూచనల మేరకే జంతుబలి అర్పించాలని పేర్కొన్నారు. పశువుల అక్రమ రవాణా, రోడ్లపై దొంగిలించిన పశువులు బలి ఇస్తే ఉపేక్షించేది లేదని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో కించపరిచే విధంగా పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సమవేశంలో సీఐ ప్రమోద్‌రావు, ఎస్సై ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ ప్రకాష్

రోడ్డు భద్రతపై అవగాహన

దండేపల్లి: మండలంలోని తాళ్లపేట గ్రామంలో రోడ్డుభద్రతపై దండేపల్లి పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. ఎస్సై తహాసినోద్దీన్ మాట్లాడుతూ.. రోడ్డు నిబంధనలు వాహనదారులు తప్పనిసరిగా పాటించాలన్నారు. వీటి ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు.

భీమిని: మండలంలోని పెద్దపేట గ్రామంలో రోడ్డు సేఫ్టీ, గంజాయ్, నకిలీ పత్తి విత్తనాలపై బుధవారం పోలీసులు అవగాహన కల్పించారు. పెద్దపేట గ్రామ పోలీస్ అధికారి దీపిక ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. విశ్రాంత డిగ్రీ ప్రిన్సిపాల్, సామాజిక కార్యకర్త డాక్టర్ నీలం సంపత్, ఎస్సై విజయ్‌కుమార్‌లు మాట్లాడుతూ.. ప్రజలకు రోడ్డు భద్రత నిబంధనలు, యువకులకు గంజాయి, నిషేధిత మత్తు పదార్థాల తీసుకోవడం వల్ల జరిగే అనర్థాల గురించి వివరించారు.



మాట్లాడుతున్న ఎస్సై విజయ్‌కుమార్

ఎంపీడీవో కార్యాలయం తనిఖీ

జన్నారం: స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని ఊట్నూర్ ఐటీడీఏ పీవో కుష్బూగుప్తా బుధవారం తనిఖీ చేశారు. రాజీవ్ యువ వికాస్ పథకంలో ఎంతమంది ఎస్టీలు దరఖాస్తులు చేసుకున్నారని ఎంపీడీవో ఉమర్ షరీఫ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆన్‌లైన్ ద్వారా 529, ఆఫ్‌లైన్‌లో 470 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు. ఆమె వెంట డీటీడీవో జనార్దన్ ఉన్నారు.